14న ఘంటసాల గానావధానం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఈనెల 14వ తేదీన నగరంలోని బాపూజీ కళామందిర్‌లో ఘంటసాల గానావధాన పాటలు, లఘునాటికలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు శ్రీసుమిత్ర కళా సమితి అధ్యక్షులు ఇప్పిలి శంకరశర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో 14 మంది కళాకారులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఘంటసాల జీవిత చరిత్రలో కొన్ని ముఖ్య ఘట్టాలతో లఘునాటికలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. సభాధ్యక్షులుగా కొంచాడ సోమేశ్వరరావు, ముఖ్య అతిథిగా రామలింగేశ్వరరావు, కార్యక్రమ నిర్వాహకులుగా పులఖండం శ్రీనివాసరావు వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి కళాకారులు, కళాభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

బూర్జ మండలం తోటవాడలో సుడా గుర్తించిన ఓ అనధికార లేఅవుట్

'రియల్' మోసం

- జిల్లాలో అడ్డూ అదుపు లేకుండా అక్రమ లేఅవుట్లు
- 62 అనధికార లేఅవుట్లు గుర్తించిన 'సుడా'
- అనుమతులు లేకుండానే విక్రయాలు
- మోసపోతున్న కొనుగోలుదారులు

జిల్లాలో అనధికార లేఅవుట్లకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. అర్బన్ ప్రాంతాల్లో కంటే పల్లెల్లో విచ్చలవిడిగా వెలుస్తున్నాయి. కనీస అనుమతులు లేకుండానే ప్లాట్లను విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల ప్రచారానికి ఆకర్షితులవుతున్న కొనుగోలుదారులు తమకు జరిగిన అన్యాయం తెలుసుకుని లబోదిబోమంటున్నారు. ఇటీవల శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) అధికారులు సర్వే చేపట్టి, జిల్లావ్యాప్తంగా ఉన్న అక్రమ లేఅవుట్లను గుర్తించి బహిరంగ ప్రకటనలు సైతం ఇచ్చారు. తమ లేఅవుట్లకు అనుమతుల్లేవని తెలిసినా, వ్యాపారులు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. ఇవేవీ తెలియని సామాన్య జనం వాటిని కొని మోసపోతున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, బూర్జ

లేఅవుట్లు వేసి, ప్లాట్లుగా మార్చేందుకు తొలుత సుడా అనుమతులు తప్పనిసరి. కొందరు అక్రమార్కులు ఇవేవీ పట్టించుకోవడం లేదు. గ్రామాల్లో రైతుల వద్ద నుంచి కారుచౌకగా భూములను కొనుగోలు చేసి వాటిలోనే లేఅవుట్లు వేస్తున్నారు. ఆ భూములను చదును చేసి నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా అమ్మేస్తున్నారు. కొందరు ప్రభుత్వ భూములు, గెడ్డలు, పంట కాలువలను సైతం ఆక్రమించి ప్లాట్లను అమ్మేస్తున్నారు. తమకు పంచాయతీల అనుమతులు ఉన్నాయని నమ్మబలుకుతున్నారు. కొంతమంది తమకు త్వరలో సుడా అనుమతులు వస్తాయని చెప్తూనే అమ్మకానికి పెడుతున్నారు. రోడ్లు, మురుగు కాలువలు, పార్కులు, ఇతర సామాజిక అవసరాలకు స్థలాలను కేటాయించడం లేదు.

నిబంధనలేం చెప్తున్నాయి?

లేఅవుట్లు, ప్లాట్ల విభజనకు సంబంధించి ప్రభుత్వం 'ది ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ డెవలప్‌మెంట్ రూల్స్ 2017' పేరుతో జూలై 18, 2017లో జిఒ నంబరు 275 విడుదల చేసింది. ఇవి మెట్రోపాలిటిన్ సిటీల నుంచి పంచాయతీల వరకు వర్తిస్తుందని అందులో పేర్కొంది. ఏ వ్యక్తి లేదా సంస్థ సంబంధిత సంస్థ అనుమతి లేకుండా ల్యాండ్ అభివృద్ధి చేయకూడదని స్పష్టంగా పేర్కొంది. లేఅవుట్లకు సంబంధించి తొలుత ఆన్‌లైన్‌లో సంబంధిత అధికారులకు దరఖాస్తు చేసుకోవాలి. ప్లాన్ డాక్యుమెంట్‌ను సమర్పించాల్సి ఉంటుంది.

లేఅవుట్ తుది ప్లాన్‌లో అంతర్గత అభివృద్ధి పనుల కోసం 15 శాతం మేర స్థలాన్ని మార్టుగేజ్ చేయాల్సి ఉంటుంది. లేఅవుట్ విస్తీర్ణం 12.5 ఎకరాలు ఉంటే అందులో రెండు శాతం స్థలాన్ని కమ్యూనిటీ హాల్, పార్కు వంటి నిర్మాణాలకు వినియోగించాలి. లేఅవుట్‌లో 0.5 శాతం మేర స్థలాన్ని తాగునీటి ట్యాంకులు, కమర్షియల్ షాపుల నిర్మాణానికి ఉపయోగించాలి. లేఅవుట్ విస్తీర్ణం 12.5 ఎకరాలకు మించి ఉంటే మూడు శాతం స్థలాన్ని కమ్యూనిటీ హాల్, ఒక శాతం స్థలాన్ని తాగునీటి ట్యాంకులు, కమర్షియల్ షాపుల నిర్మాణానికి వాడాలి. పది శాతం మేర స్థలాన్ని పబ్లిక్ ఓపెన్ స్పేస్‌గా ఉంచాలి. లేఅవుట్‌లో కనీసం 40 అడుగుల రహదారి ఉండాలి.

'నాలా' పన్ను ఎగనామం

లేఅవుట్ల కోసం ఎక్కువగా వ్యవసాయ భూములనే రైతుల భూములనే కొనుగోలు చేస్తున్నారు. వ్యవసాయ భూములను వాణిజ్య అవసరాలకు వినియోగించాలంటే వ్యవసాయేతర భూముల మదింపు చట్టం (నాలా) ప్రకారం ఎకరాకు 11 శాతం మేర పన్ను చెల్లించాల్సి ఉంటోంది. కొంతమంది వ్యాపారులు నాలా చెల్లించకుండానే ప్లాట్లుగా విభజించి విక్రయాలు సాగిస్తున్నారు. మరికొంతమంది వ్యాపారులు లేఅవుట్ వేసిన భూమిలో కొంత భాగాన్నే చూపించి నామమాత్రంగా పన్ను చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది.

'సుడా' పరిధిలో అనధికార లేఅవుట్లు

మండలం	సంఖ్య
గార	6
కోటబొమ్మాళి	3
కొత్తూరు	1
జి.సిగడాం	2
టెక్కలి	1
నరసన్నపేట	4
పలాస	5
పొందూరు	3
పోలాకి	1
బూర్జ	5
మెళియాపుట్టి	1
రణస్థలం	3
లావేరు	4
శ్రీకాకుళం	2
సంతబొమ్మాళి	2
సారవకోట	1
ఎచ్చెర్ల	1
కవిటి	1
సోంపేట	1
ఇచ్ఛాపురం	1
ఎచ్చెర్ల	1
కంచిలి	2
కవిటి	1
మందస	7

62 అనధికార లేఅవుట్ల గుర్తింపు

జిల్లాలో సుడా సంస్థ 30 మండలాల్లో విస్తరించింది. వాటితో పాటు శ్రీకాకుళం, ఆమదాలవలస, పలాస-కాశీబుగ్గ, ఇచ్ఛాపురం పురపాలక సంఘాలూ దాని పరిధిలోనే ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో కొన్నేళ్లుగా పదుల సంఖ్యలో లేఅవుట్లు వెలిశాయి. ఇప్పటికే క్రయ విక్రయాలు జరిగిపోతున్నాయి. నివాస స్థలాలకు డిమాండు పెరగడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. క్షేత్రస్థాయిలో ఇంకా ఎక్కువగానే ఉన్నట్లు తెలుస్తోంది. అక్రమ లేఅవట్లపై సుడా అధికారులు ఆరు నెలల పాటు సర్వే చేపట్టారు. వీటిలో కనీస సౌకర్యాలు లేకుండా ఉన్న లేఅవుట్లూ ఉన్నాయి. దీంతోపాటు సుడా అనుమతుల్లేకుండానే ప్లాట్లను వేసి విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఆ విధంగా జిల్లాలో 62 వరకు అక్రమ లేఅవుట్లు ఉన్నట్లు గుర్తించి సంబంధిత రియల్ వ్యాపారులకు నోటీసులు ఇచ్చారు.

అనధికార లేఅవుట్లపై చర్యలు

సుడా అనుమతి లేని అనధికార లేఅవుట్లపై చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలో 62 అక్రమ లేఅవుట్లను గుర్తించి పత్రికల్లో ప్రకటనలు ఇచ్చాం. అనుమతి లేని లేఅవుట్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వవద్దని ఇపిడిసిఎల్ అధికారులకు లేఖ రాశాం. భూములను రిజిస్ట్రేషన్ చేయొద్దని రిజిస్ట్రేషన్ శాఖను కోరాం. లేఅవుట్లల్లో రాళ్లను తొలగించాలని పంచాయతీ అధికారులకు చెప్పాం.

- టి.జి రామ్మోహన్, ప్లానింగ్ ఆఫీసర్ (సుడా)

మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కిషోర్ కుమార్

సిలబస్ మార్పుతో విద్యార్థులకు నష్టం

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్

ప్రజాశక్తి - రణస్థలం రూరల్

పదో తరగతి విద్యార్థులకు మారిన పాఠ్య పుస్తకాల్లో కంటెంట్, పాఠాలు భవిష్యత్‌లో విద్యార్థులకు ఏమాత్రం ఉపయోగపడే విధంగా లేవని, దీనివల్ల విద్యార్థులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్ అన్నారు. మండలంలోని రణస్థలం, కోష్ట, పైడిభీమవరం, పాతర్లపల్లితో పాటు పలు పాఠశాలల్లో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మారిన పదో తరగతి సోషల్ పాఠ్య పుస్తకంలో 258 పేజీలు ఉంటే 167 పేజీలు యూరోపియన్ చరిత్రకు కేటాయించి, రాష్ట్ర చరిత్రకు అత్యంత తక్కువ పేజీలు ఇవ్వడం విద్యార్థులకు ఎలా ఉపయోగమో చెప్పాలన్నారు. గతేడాది తొమ్మిది తరగతి హిందీ పుస్తకం చాలా ఇబ్బందికరంగా ఉందని, అర్థం చేసుకోలేని ఉత్తర భారతదేశం మాండలికాలు ప్రవేశపెట్టడం వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులను గందరగోళానికి గురిచేసిందని చెప్పారు. ఈ ఏడాది పదో తరగతి పాఠ్య పుస్తకాలను అదే పద్ధతిలో ముద్రించి విద్యార్థులకు హిందీ భాషపై ఆసక్తిని తగ్గించే ప్రక్రియను చేపట్టారనే అనుమానం వ్యక్తం చేశారు. భౌతికశాస్త్రంలో మూలకాల వర్గీకరణ, పరమాణు నిర్మాణం, రసాయన బంధం వంటి పాఠాలు తొలగించడం దారుణమన్నారు. విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథాన్ని అలవరిచే పాఠ్యాంశాలను తీసివేయడం సరికాదన్నారు. గణిత సబ్జెక్టులో భవిష్యత్ పోటీ పరీక్షలకు సిద్ధపడే విద్యార్థులకు ఉపయోగపడే విధంగా లేవని తెలిపారు. పాత పాఠ్యాంశాలను తిరిగి చేర్చాలని, పిల్లల్లో సృజనాత్మకత, శాస్త్రీయ దృక్పథం పెంపుదల కోసం ప్రశ్నించేతత్వాన్ని పెంపొందించే పాఠ్యాంశాలను తొలగించడం సరికాదన్నారు. ప్రాథమిక పాఠశాల వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందని విమర్శించారు. గత ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత, ఏకపక్ష విధానాలు ఒక కారణం కాగా, కొత్త ప్రభుత్వం వెంటనే స్పందించి 117 జిఒను రద్దు చేయడం, సమాంతర మీడియాలను కొనసాగించడం, ప్రాథమిక పాఠశాల కొనసాగింపుపై ప్రకటన చేయకపోవడం కారణమని విమర్శించారు. జిల్లాలో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య కోసం ఉపాధ్యాయులు అవసరమైతే ఒక గంట సమయాన్ని అదనంగా కేటాయించాలని, విద్యార్థులందరికీ చదవడం, రాయడం నేర్పించే బాధ్యత తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఎస్.నారాయణరావు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామారావు, ఎల్.కోదండరామయ్య, జిల్లా కోశాధికారి రవికుమార్, జిల్లా నాయకులు డి.కోటేశ్వరరావు, టి.శంకరరావు, కుమారస్వామి, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కోతకు గురైన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

రక్షణ గోడ నిర్మాణానికి చర్యలు

- పెద్దగణగళ్లపేట బీచ్ అభివృద్ధికి కృషి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్

నాగావళి నదిలో వరద ఉధృతికి కోతకు గురవుతున్న పెద్దగణగళ్లవానిపేట వద్ద రక్షణ గోడ నిర్మాణానికి చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. మండలంలోని పెద్దగణగళ్లవానిపేట వద్ద కోతకు గురవుతున్న సముద్ర తీర ప్రాంతాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి బోట్లపై వెళ్లి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నదీ ప్రవాహం తన దిశను మార్చుకోవడం వల్ల సముద్ర ప్రాంతం కోతకు గురవుతుందని చెప్పారు. దీనివల్ల గ్రామానికి వరద ముప్పు పొంచి ఉందన్నారు. చాలావరకు సముద్రతీరం కోతకు గురైనట్టు గుర్తించారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి త్వరలోనే ఈ ప్రాంతంలో రక్షణ గోడ నిర్మాణం చేపట్టి శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. కొన్నేళ్లుగా ఈ సమస్య ఉందని, ప్రజలు ఆందోళన చెందవద్దని అన్నివిధాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. సముద్ర తీరం కోతకు గురికాకుండా ఉండేందుకు శాస్త్రీయ అధ్యయనం కోసం డైరెక్టర్, నేషనల్ సెంటర్ ఫర్ కోస్టల్ రీసెర్చ్‌కు లేఖలు పంపామన్నారు. ఈ ప్రాంతంలో పార్కులను నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. ప్రజలకు ఆహ్లాదాన్ని అందించే బీచ్‌ను సుందరంగా తీర్చిదిద్ది పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తమవంతు కృషి చేస్తామని హామీనిచ్చారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ కోతకు గురికావడంపై గ్రామస్తులు ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం అన్నివిధాలుగా అండగా ఉంటుందని చెప్పారు మత్స్యకార గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మత్స్యకారులకు లాభం చేకూర్చే విధంగా అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మత్స్య శాఖ ఉప సంచాలకులు శ్రీనివాస్, జిల్లా పర్యాటక అధికారి నారాయణరావు, తహశీల్దార్, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, సంబంధిత శాఖల అధికారులు, మత్స్యకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిర్మాణంలో ఉన్న పెట్రోల్ బంకుకు నోటీసులు

ప్రజాశక్తి - సరుబుజ్జిలి

మండలంలోని బప్పడాం గ్రామ పంచాయతీ పరిధిలో నిర్మాణంలో ఉన్న పెట్రోల్ బంకుకు నోటీసులు మంజూరు చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఆదేశించారు. అలికాం-బత్తిలి ప్రధాన రహదారిని ఆనుకొని ఏర్పాటు కానున్న పెట్రోల్ బంకు స్థలాన్ని బుధవారం పరిశీలించారు. బంకు నిర్మాణంతో పాటు ఏర్పాటుకు అన్ని శాఖల నుంచి నిరభ్యంతర పత్రం పొందాల్సి ఉన్నా, ఎన్‌ఒసి రాకుండానే నిర్మాణాలు చేపట్టడం ఏమిటని జెసి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్ఇఒసి లేకుండా నిర్మాణం చేపట్టిన పెట్రోల్ బంకు యజమానానికి నోటీసులు జారీ చేయాలని తహశీల్దార్ ఎల్.మధుసూదన్‌ను ఆదేశించారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విపత్తుల్లో బ్యాంకర్ల సహకారం అవసరం

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు, సమాజ ఆర్థికాభివృద్ధితో పాటు జిల్లా ఆర్థిక ప్రగతిలో బ్యాంకర్ల భాగస్వామ్యం, సహకారం ఎంతైనా అవసరమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ (డిసిసి), బ్యాంకర్ల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. జిల్లాలోని అన్ని బ్యాంకులకు నిర్దేశించిన పలురకాల రుణ లక్ష్యాలు, సాధించిన ప్రగతిని ఆయా బ్యాంకుల ప్రతినిధులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల వరదల వల్ల నష్టాన్ని అంచనా వేయనున్నామని, వరదలను ప్రకృతి వైపరీత్యంగా ప్రకటించినట్లు తెలిపారు. బ్యాంకర్లు సమర్థవంతంగా పనిచేస్తేనే ఆర్థిక వ్యవస్థ మరింత దృఢంగా ఉంటుందన్నారు. మూడు ప్రకృతి వైపరీత్యాలకు జిల్లా గురైనా ఎటువంటి నష్టం లేకపోవడం శుభపరిణామమన్నారు. పాక్షికంగా రోడ్లు, భవనాలు, కెనాల్స్ దెబ్బతిన్నాయన్నారు. జిల్లాలో సంభవించిన ప్రకృతి వైపరీత్యాల నష్టాలపై శాఖల వారీగా ఆరా తీశారు. జిల్లాలో 55 గృహాలు దెబ్బతిన్నట్లు నివేదికలు వచ్చాయని, వాటిని పరిశీలించాల్సి ఉందన్నారు. వ్యవసాయ సంయుక్త సంచాలకులు కె.శ్రీధర్ మాట్లాడుతూ కౌలు రైతులకు రుణాల మంజూరు విధానంపై వారం రోజుల పాటు అవగాహనా సదస్సు ఏర్పాటు చేయాలని కోరారు.

ఎల్‌డిఎం ఎం.సూర్యకిరణ్ మాట్లాడుతూ వలస రైతుల సహాయార్థం వ్యవసాయశాఖ అధికారులు బ్యాంకర్లను సంప్రదించాలన్నారు. వారికి బ్యాంకర్లు శతశాతం సహాయ సహకారం అందించాలని కోరారు. ఆర్ఎం హసీబ్, యూనియన్ బ్యాంకు ఆర్.హెచ్ వెంకట్ తిలక్ మాట్లాడుతూ రైతులకు బ్యాంకుల ద్వారా సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. సమావేశంలో నాబార్డు డిడిఎం రమేష్‌కృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.అప్పారావు, డిఆర్‌డిఎ పీడీ పి.కిరణ్ కుమార్, జిల్లా ఉద్యాన అధికారి ఆర్.వి ప్రసాద్, పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఉమామహేశ్వరరావు, పలు బ్యాంకుల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టుకు స్థల సేకరణ చేపట్టాలి

ఆర్‌డిఒ భరత్ నాయక్

ప్రజాశక్తి - పలాస

పలాస డివిజన్ పరిధిలో ఎయిర్‌పోర్టు కోసం వెయ్యి ఎకరాలు అవసరమని ఆర్‌డిఒ భరత్ నాయక్ తెలిపారు. మందస, సోంపేట, కంచిలి మండలాల్లో భూములను పరిశీలించి నివేదిక ఇవ్వాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అనుమతుల్లేకుండా కంకర, మట్టి తవ్వకాలు చేపట్టినట్లు అధికారుల దృష్టికొస్తే తక్షణమే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. భూ సమస్యలకు సంబంధించిన కోర్టు కేసులను త్వరితగతిన పరిష్కారమయ్యే దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. 'మీకోసం' వినతులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. మీసేవా కేంద్రాల్లో ధ్రువపత్రాలు పెండింగ్‌లో ఉంటే సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో తహశీల్దార్లు బి.సత్యం, పి.బాల, బి.గిరి, ఎన్.భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ భరత్ నాయక్

ఎఎన్ఎంపై చర్యలు తీసుకోవాలి

టెక్కలి రూరల్ : ఆశావర్కర్‌ను వేధింపులకు గురిచేసిన టెక్కలి సచివాలయం-3 ఎఎన్ఎం హేమలతపై చర్యలు తీసుకోవాలని ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.నాగమణి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. వేధింపులు తాళలేక ఇటీవల ఆత్మహత్యాయత్నానికి పాల్పడి జిల్లా కేంద్రాస్పత్రిలో చికిత్స పొందుతున్న సరస్వతిని బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని కె.కొత్తూరు పిహెచ్‌సిలో ఆశావర్కర్‌గా పనిచేస్తున్న సరస్వతిని ఎఎన్ఎం తీవ్రంగా వేధింపులకు గురిచేశారని చెప్పారు. దీంతో ఆమె మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని తెలిపారు. కరోనా సమయంలో ప్రాణాలను లెక్కచేయకుండా ఆశావర్కర్లు పనిచేశారని గుర్తుచేశారు. అలాంటి వారిపై వేధింపులు నిత్యకృత్యమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. సెలవులు కూడా లేకుండా పనిచేస్తున్న ఆశావర్కర్లపై అధికారులు, రాజకీయ నాయకులు, వైద్యులు, ఎఎన్ఎంల వేధింపులు పెరుగుతున్నాయని తెలిపారు. వేధింపులకు గురిచేసిన ఎఎన్ఎం హేమలతను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు డి.ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సరస్వతిని పరామర్శిస్తున్న యూనియన్ నాయకులు

జిల్లాస్థాయి తనిఖీ కమిటీ ఏర్పాటు

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్రంలో పలుచోట్ల పరిశ్రమల్లో సంభవించిన ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టి తదుపరి నివేదికను ప్రభుత్వానికి సమర్పించేందుకు జిల్లాస్థాయి తనిఖీ కమిటీని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ నియమించారు. ఈమేరకు జిల్లా ఫ్యాక్టరీస్ ఉప కమిషనర్ రాంబాబు ఒక ప్రకటన విడుదల చేశారు. కమిటీలో డిఎస్‌పి, కాలుష్య నియంత్రణ మండలి ఇఇ, జిల్లా అగ్నిమాపక అధికారి, శ్రీకాకుళం, విజయనగరంలో ఉన్న డిప్యూటీ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ బాయిలర్ విశాఖపట్నం, శ్రీకాకుళం డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ సభ్యులు గానూ, మెంబరు సెక్రటరీగా డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ వ్యవహరిస్తారని వివరించారు. అపిటోరియా ఫార్మా, అరబిందో ఫార్మా, ఆంధ్రా ఆర్గానిక్స్, మహాధన్ అగ్రిటెక్, నాగార్జున అగ్రికమ్, డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ సంస్థల్లో తనిఖీలు చేపట్టి పూర్తి నివేదికను 30 రోజుల్లో ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు తెలిపారు.

సహారా బాధితులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి - సోంపేట

సహారా సంస్థలో డిపాజిట్ చేసిన సొమ్ము తిరిగి రాక ఇబ్బందులు పడుతున్న ఖాతాదారులు, ఏజెంట్లకు తక్షణమే న్యాయం చేయాలని సహారా బాధితుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి.సత్యరాజ్ డిమాండ్ చేశారు. సోంపేటలో బాధితులు, ఏజెంట్లతో కలిసి బుధవారం ఆందోళన చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సహారా సంస్థలో డిపాజిట్ చేసిన సొమ్మును ఖాతాదారులకు తిరిగి చెల్లిస్తామని ప్రభుత్వాలు హామీనిచ్చినా, ఇంతవరకు న్యాయం జరగలేదన్నారు. 12 ఏళ్ల పాటు ఖాతాదారుల సొమ్మును నిలుపుదల చేసి నిర్లక్ష్యంగా ఉండడం తగదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత ఖాతాదారుల డిపాజిట్ సొమ్ములను జమయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు సుందరరావు, మాధవరావు, సూర్యారావు, రామ్‌చరణ్, విశ్వేశ్వరరావు, పండా బాధిత ఖాతాదారులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ పొందూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో
OS.82/2023

వాది:- వట్లూరు రామకృష్ణ
ప్రతివాది:- గేదెల వాసుదేవరావు

To,
ప్రతివాది అడ్రసు:
గేదెల వాసుదేవరావు, S/o లక్ష్మునాయుడు,
గేదెలపేట గ్రామం, జి.సిగడాం మండలం,
శ్రీకాకుళం జిల్లా.

ప్రకటన

పై నెంబరు దావాను ప్రతివాది పైన వాది ప్రోనోట్ బాకీని రాబట్టే నిమిత్తం దాఖలు చేయడమైనది. సదురు దావాలో ప్రతివాది శ్రీ పొందూరు జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టులో **తేదీ 20-9-2024 ఉదయం 10:30ని॥లకు** హాజరై అతని గల ఆక్షేపణలు స్వయంగా గాని వకీలు ద్వారా గాని తెలియజేయగలరు అటులు గాని ఎడల మీకు వ్యతిరేకంగా తీర్పు ఇవ్వడం జరుగునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

(By order of the Harble court).

ఇనుముల శ్రీరాములనాయుడు
న్యాయవాది,
రాజాం, ఫోన్ 9441289946

మహారాజశ్రీ పొందూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో
OS.70/2023

వాది:- గేదెల సత్యన్నారాయణ
ప్రతివాది:- గేదెల వాసుదేవరావు

To,
ప్రతివాది అడ్రసు:
గేదెల వాసుదేవరావు, S/o లక్ష్మునాయుడు,
గేదెలపేట గ్రామం, జి.సిగడాం మండలం,
శ్రీకాకుళం జిల్లా.

ప్రకటన

పై నెంబరు దావాను ప్రతివాది పైన వాది ప్రోనోట్ బాకీని రాబట్టే నిమిత్తం దాఖలు చేయడమైనది. సదురు దావాలో ప్రతివాది శ్రీ పొందూరు జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టులో **తేదీ 20-9-2024 ఉదయం 10:30ని॥లకు** హాజరై అతని గల ఆక్షేపణలు స్వయంగా గాని వకీలు ద్వారా గాని తెలియజేయగలరు అటులు గాని ఎడల మీకు వ్యతిరేకంగా తీర్పు ఇవ్వడం జరుగునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

(By order of the Harble court).

ఇనుముల శ్రీరాములనాయుడు
న్యాయవాది,
రాజాం, ఫోన్ 9441289946

ఎమ్మెల్యేను సత్కరిస్తున్న బెంతు ఒరియాలు

బెంతు ఒరియాలకు అండగా ఉంటా

ప్రజాశక్తి- కవిటి

సమస్యల పరిష్కారానికి పోరాడుతున్న బెంతు ఒరియాలకు అండగా ఉంటానని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గ బెంతు ఒరియాల తరఫున మంగళవారం రాత్రి రామయ్యపుట్టుగలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అశోక్‌కు ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకు బెంతు ఒరియాల సమస్యల సాధనకు తాను చేసిన కృషి వివరించారు. ప్రస్తుతం విద్యార్థులు సమస్యలు ఎదుర్కొంటున్నారని వారికి నేటివిటి సర్టిఫికెట్ అందేలా చర్యలు తీసుకుంటానని హామీఇచ్చారు. అనంతరం మూడు మండలాల తహశీల్దార్లతో సమావేశమై సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో బెంతు ఒరియా ప్రతినిధులు ధనుంజయ మజ్జి, రజనీ కుమార్ దొళాయి, శివ బిసాయి, సుమన్ బిసాయి, వేణు సాహు, ఢిల్లీ బిసాయి, చిత్రాసేన్ సాహు, మాధవ్ సాహు, శ్రీరామ్మూర్తి, హరికృష్ణ బిసాయి తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎన్ఇఆర్

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలి

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

ఇటీవల కురిసిన వర్షాల కారణంగా నియోజకవర్గంలో గ్రామీణ రోడ్లు, చెరువులు పూర్తిగా దెబ్బతిన్నాయని, వాటి అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు కోరారు. బుధవారం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

ఆర్థికసాయం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

అప్పారావుకు అండగా స్వచ్ఛంద సంస్థలు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- కవిటి

'ఆయువు కోసం ఆరాటం' అంటూ శ్రీకాకుళం మెడికవర్ ఆస్పత్రిలో జీవన్మరణ సమస్యలో ఉన్న వలస కూలీ బదకల అప్పారావు దీనస్థితిపై గత శనివారం ప్రజాశక్తి ప్రచురించిన కథనానికి దాతలు ఉదారంగా స్పందిస్తున్నారు. ఈ క్రమంలో ఎస్ఎంఎస్ ఫౌండేషన్ సంస్థ సభ్యులు బుధవారం ప్రగడపుట్టుగ గ్రామానికి చేరుకుని అప్పారావు కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. తమ సంస్థ తరుపున రూ.7 వేలు ఆర్థికసాయం అందించారు. అదే విధంగా సేవాసమితి ఫౌండేషన్ రూ.10 వేలు ఆర్థికసాయం అందించింది. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు మాట్లాడుతూ దయనీయ స్థితిలో ఉన్న అప్పారావును దాతలు ఉదారంగా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ సభ్యుడు యాంద్రాపు చిరంజీవి, గ్రామస్తులు కొంపల్లి సాగర్, దాసరి వినయ్, యాంద్రాపు జోగారావు పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

శుచి, రుచితో నాణ్యమైన ఆహారం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రస్తుత కాలంలో ఎక్కువ మంది ప్రజలు హోటల్ భోజనం పైనే ఆధారపడుతున్నారని, అటువంటి వారికి రుచి, శుచి గల ఆహారాన్ని అందించి నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని ఎమ్మెల్యే గొండు శంకర్ సూచించారు. నగరంలోని పాతబస్టాండ్ సమీపాన రోణంకి యుగంధర్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన రాజ దర్బార్ మిలటరీ హోటల్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారంలో దినదినాభివృద్ధి సాధించాలన్నారు. కార్యక్రమంలో ఆయనతో పాటు తెలుగు యువత జిల్లా అధ్యక్షులు మెండ దాసునాయుడు, టిడిపి నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్, కొర్ను ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ముంపు పొలాలు పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు

ముంపు పొలాలు పరిశీలన

ఇచ్ఛాపురం: మండలంలోని ఇన్నీసుపేట, రత్తకన్న గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు ముంపునకు గురైన వరి పొలాలను ఆమదాలవలస కెవికె శాస్త్రవేత్తలు డా.హరికుమార్, డా. కిరణ్ కుమార్, జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకటరావుతో కూడిన బృందం ముంపు ప్రాంతాల్లో పంట పొలాలు బుధవారం పరిశీలించారు. సోంపేట డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు కె.జగన్మోహనరావు, ఇచ్ఛాపురం మండల ఎఒ టి.భార్గవి రైతులకు సూచనలు చేశారు. పొలంలోని అధిక నీరు తొలగించి పంట ఎదుగుదలకు 25 కేజీల యూరియా, 15 కేజీల పోటాష్ వేయాలని సూచించారు. తెగులు నివారణకు హెక్సాకోనజోల్ లీటరు నీటికి 2 ఎంఎల్ చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. వ్యవసాయశాఖ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి స్పందన

లావేరు: మండలంలోని తామాడ పంచాయతీ రాయినింగారిపేటలో మురపాక పిహెచ్‌సి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వైద్య శిబిరంలో వైద్యాధికారిని శోభారాణి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, మాజీ సర్పంచ్ గొర్లె శ్రీనువాసరావు పాల్గొన్నారు.

వర్గీకరణ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

శ్రీకాకుళం అర్బన్ ధర్నా చేస్తున్న దళిత సంఘాల నాయకులు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

ఎస్‌సి, ఎస్‌టి వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దళిత మహాసభ గౌరవాధ్యక్షులు వి.బెంజిమాన్ అన్నారు. సుప్రీం తీర్పుపై స్థానిక అంబేద్కర్ కూడలి వద్ద బుధవారం నిరసన తెలిపారు. వర్గీకరణను వ్యతిరేకిస్తున్న 58 ఉప కులాలకు న్యాయం చేయాలన్నారు. ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా సౌకర్యాలను కల్పించి అండగా నిలవాలన్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్ని సంవత్సరాలైనా దళితుల జీవితాల్లో వెలుగులు చూడలేదన్నారు. అనంతరం ఇలిసిపురంలోని అంబేద్కర్ విజ్ఞాన మందిరంలో దళిత మహాసభ రాష్ట్ర నాయకులు డాక్టర్ గంజి ఆర్ ఎజ్రా అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కొన్ని రాజకీయ పార్టీలు అధికారం కోసం ఐక్యంగా కులాల్లో చిచ్చు పెట్టి లబ్ధి పొందాలన్న దుర్మార్గమైన ఆలోచనతో పాలన కొనసాగిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో దళిత ఉద్యమ సంఘ నాయకులు పోతల దుర్గారావు ఎస్సీ వర్గీకరణ సమితి జిల్లా కన్వీనర్ బోకర నారాయణరావు, మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి బోనెల అప్పారావు, దళిత హక్కుల పరిరక్షణ సమితి నాయకులు అంపోలు ప్రతాప్ తదితరులు ఉన్నారు

ధర్నా నిర్వహిస్తున్న దళిత సంఘాల ప్రతినిధులు

కొత్తూరు: ఎస్‌సి వర్గీకరణకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ ఆ తీర్పును సుప్రీంకోర్టు పున: సమీక్షించాలని కోరుతూ ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద జాతీయస్థాయిలో జరుగుతున్న మహాధర్నాకు సంఘీభావంగా బుధవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద మండల ఎస్‌సి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితిసభ్యుల ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులు బొద్దెపల్లి కృష్ణ, ప్రధాన కార్యదర్శి పడాల నాగభూషణం మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధమని, దళితుల ఐక్యతను దెబ్బతీసేలా ఉందన్నారు. కార్యక్రమంలో జమ్మయ్య, గుమ్మయ్య, ఉపాధ్యక్షులు వడమ శ్రీను, సింహాచలం, కోశాధికారి రామకృష్ణ, రామారావు, త్రినాథరావు, రాంబాబు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలియజేస్తున్న దళిత సంఘాల నాయకులు

నల్లబ్యాడ్జీలు ధరించి సేవలందిస్తున్న డాక్టర్ శివశంకర్

85 జిఒను రద్దు చేయాలి

ప్రజాశక్తి- పొందూరు

రాష్ట్రంలో పిజి వైద్య విద్యలో ఇన్ సర్వీస్ కోటాను కుదిస్తూ తీసుకువచ్చిన జిఒ 85ను ప్రభుత్వం రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సంఘం జిల్లా కార్యదర్శి డాక్టర్ జి.రమేష్ నాయుడు డిమాండ్ చేశారు. మండలంలోని రాపాక, పొందూరు, కృష్ణాపురంలో బుధవారం నిర్వహించిన వైద్య శిబిరంలో నల్ల బ్యాడ్జీలు ధరిస్తూ విధుల్లో పాల్గొని తమ నిరసనను తెలియజేశారు. కోవిడ్ సమయంలో తమ ప్రాణాలను ప్రమాదంలో పెట్టి సేవలు అందించామని, జిఒ 85 ద్వారా తమ అవకాశాలను తగ్గించడం అన్యాయ మన్నారు. ప్రభుత్వం జిఒ 85ను రద్దుచేసి వైద్యుల సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే తమ ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. అనంతరం గ్రామాల్లో నిర్వహించిన వైద్య శిబిరంలో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు శివ శంకర్, నవీన్, నాగపవన్ కళ్యాణం, సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పిలు, హెల్త్ అసిస్టెంట్లు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయాన్ని అందజేస్తున్న రాజశేఖర్ రెడ్డి

బాధితునికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని గంగరాజపురానికి చెందిన అర్జున్ బిశ్వాల్‌కు చెందిన పూరిల్లు ఇటీవల కురిసిన వర్షాలకు పడిపోయింది. విషయం తెలుసుకున్న మాజీ మండల టిడిపి అధ్యక్షులు, ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ అనపాన రాజశేఖర్ రెడ్డి బుధవారం పరామర్శించారు. పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆదేశాల మేరకు తన సొంత నిధులతో 25 కేజీల బియ్యం, కూరగాయలు, నిత్యవసర వస్తువులతో పాటు రూ.2వేలు ఆర్థికసాయాన్ని అందించారు. ఈయనతో పాటు మండల తెలుగు యువత అధ్యక్షులు బసవ పరమేశ్వర్ రెడ్డి, సర్పంచ్ బమ్మిడి భాస్కరరావు, మాజీ సర్పంచ్‌లు గోక మోహనరావు, హనుమంతు చంద్రశేఖర్, వరిసి గణపతిరావు, ఒట్టి కోళ్ల చక్రి, వీరన్న, లావుడు తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు పనులను పరిశీలిస్తున్న ఇఒ

కల్వర్టు పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి- టెక్కలి

మేజర్ పంచాయతీ పరిధి కండ్రవీధిలో కల్వర్టు పనులు త్వరితగతిన పూర్తిచేసి వాహనాల రాకపోకలకు ఆటంకం లేకుండా చూడాలని ఇఒ కె.వి.వి.జగన్నాథం కోరారు. బుధవారం పట్టణంలోని కండ్రవీధి, కచేరీవీధి తదితర ప్రాంతాల్లో పర్యటించారు. కల్వర్టు పలకలు తొలగించి పూడికతీత పనులు వేగవంతం చేయాలన్నారు. అదే విధంగా పట్టణంలోని సంతోషిమాత ఆలయం వద్ద రోడ్డు ప్రక్కనున్న కాలువలోని పూడికతీత పనులను పరిశీలించారు. ఈయనతో పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

'కాకినాడ ఆదిత్య' విద్యార్థుల సాయం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

విజయవాడ వరద బాధితులకు కాకినాడ ఆదిత్య జూనియర్ కాలేజ్ విద్యార్థులు తమవంతు సాయాన్ని బుధవారం అందజేశారు. విద్యార్థులు సేకరించిన నిత్యావసర సరుకులు, బిస్కెట్ ప్యాకెట్లు వాటర్ బాటిళ్లు, దుస్తులను వరద బాధిత ప్రాంతానికి ప్రత్యేక వాహనాల్లో పంపించారు. విద్యార్థులకు కళాశాల సెక్రటరీ ఎం.దీపక్ రెడ్డి, డైరెక్టర్ బి.ఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ ఎం.ఢిల్లేశ్వరరావు అభినందించారు. విపత్తు సమయంలో నిరాశ్రయులైన వారిని ఆదుకునేందుకు విద్యార్థులు ముందుకు రావడం అభినందనీయమన్నారు.

నౌపడ: విజయవాడ వరద బాధితులకు నౌపడ సత్యసాయి విద్యానికేతన్‌కు చెందిన విద్యార్థులు ఆర్థికసాయం అందజేశారు. విద్యార్థుల నుంచి రూ.10 వేలు విరాళాలు సేకరించామని, ఈ మొత్తాన్ని సిఎం రిలీఫ్ ఫండ్‌కు అందజేస్తామని కరస్పాండెంట్ ఎం.చంద్రశేఖర్ తెలిపారు.

వరద బాధితుల కోసం సిద్ధం చేసిన సరుకులు

నిబంధనల ప్రకారం చెరువుల వేలం

కోటబొమ్మాళి : పంచాయతీ పరిధిలో చేపల చెరువుల వేలం పాటలు ప్రభుత్వ నిబంధనలు ప్రకారమే జరగాలని టెక్కలి డిఎల్‌పిఒ ఐ.వి. రమణ తెలిపారు. మండలం ఎత్తురాళ్లపాడు పంచాయతీలో సంబంధిత సర్పంచ్ చెరువును బహిరంగ వేలం వేయకుండా సంబంధిత పాటదారుల నుంచి సొమ్ములు వసూళ్ల చేసి వారికి చెరువును అప్పజెప్పారని, ఇది పంచాయతీ నిధులకు జమ కాలేదని కొంత మంది గ్రామస్తులు డిఎల్‌పిఒకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయన బుధవారం ఎత్తురాళ్లపాడులో విచారణ చేపట్టారు. పంచాయతీ పరిధిలో బహిరంగ వేలం ద్వారా వచ్చిన నిధులు పంచాయతీ అభివృద్ధి పనులకు వినియోగించాల్సి ఉందని, ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి అక్రమాలకు పాల్పడవద్దన్నారు. విచారణ నివేదికలను ఉన్నతాధికారులకు అందజేస్తానని తెలిపారు. ఈయనతో పాటు ఎంపిడిఒ కె. ఫణీంద్రకుమార్, ఇఒపిఆర్‌డి జి.రామారావు, కార్యదర్శి తదితరులున్నారు.

విచారణ చేపడుతున్న అధికారులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

మారథాన్‌లో పాల్గొన్న విద్యార్థులు

శ్రీకాకుళం అర్బన్: పెరుగుతున్న ప్రజల అవసరాల వల్ల పచ్చదనం విధ్వంసానికి గురవుతోందని, అందువల్ల ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు నడుం కట్టాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు కె సూర్యచంద్రరావు పిలుపునిచ్చారు. జూనియర్ ఛాంబర్స్ ఆఫ్ ఇంటర్నేషనల్ (జెసిఐ) వారోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలకు మానవ తప్పిదాలే కారణమవుతున్నాయని, అందువల్ల పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మారథాన్ రన్‌ను జెసిఐ వ్యవస్థాపకులు డా.జామి భీమశంకరరావు, ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఏడు రోడ్ల కూడలి నుంచి ఆర్ట్స్ కళాశాల వరకు ఈ ర్యాలీ సాగింది. కార్యక్రమంలో జెసిఐ శ్రీకాకుళం మెయిన్ అధ్యక్షులు కూన అనిల్‌కుమార్, శ్రీకాకుళం గ్రీన్ సిటీ అధ్యక్షూలు బెందాళం వరలక్ష్మి, వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు కొంక్యాన మురళి, వనిత వాకర్స్ లక్ష్మి, గేదెల ఇందిరా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పొలంబడి

ప్రజాశక్తి- జి.సిగడాం

మండలంలో జగన్నాథవలసలో మండల వ్యవసాయాధికారి వై.శారద ఆధ్వర్యంలో గ్యాప్ పొలం బడి నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా వనరుల కేంద్రం ఎఒ వై.సూర్య కుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు వరిలో వచ్చే పీక పురుగు, ఆకు ముడత, దోమపోటు వంటి పురుగులు, అగ్గితెగులు, పొడతెగులు, వాటి నివారణపై వివరించారు. వరిలో ఆకు కత్తిరింపు ప్రయోగాలు చేసి చూపించారు. సమగ్ర ఎరువులు యాజమాన్యం, పొటాష్ ఎరువు ఉపయోగంపై వివరించారు. అలాగే ఎపిసిఎన్ఎఫ్ సిబ్బంది జిల్లేడు కషాయం తయారు చేసి చూపించారు. కార్యక్రమంలో ఎపిసిఎన్ఎఫ్ సిబ్బంది, రెడ్డీస్ ఫౌండేషన్ సిబ్బంది, విఎఎ బి.రాణి, ఎం.హరీష్ కుమార్, గోగు కిరణ్, సిఇఒ ఎన్.శ్రీనివాసరావు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

రణస్థలం: వరిలో అధిక దిగుబడి రావాలన్నా, చీడపీడలను అధిగమించాలన్నా సీడ్‌డ్రిల్ యంత్రంతో సాగు చేయాలని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఏరియా మేనేజర్ తవిటినాయుడు అన్నారు. లావేరు మండలం తాళ్లవలసలో ఆయన మాట్లాడుతూ వరిని సీడ్‌డ్రిల్ యంత్రంతో నేరుగా సాగు చేయడం వలన 15 కేజీల విత్తనాన్ని ఆదా చేయవచ్చని, చేను వరుసల్లో ఉండటం వలన పురుగులు, తెగుళ్ల బెడత తక్కువగా ఉండటమేకాక మేలైన దిగుబడులు సాధించవచ్చని రైతులకు సూచించారు. రైతులకు ఎటువంటి సమస్య ఉన్న నేరుగా శాస్త్రవేత్తలతో మాట్లాడు కోవచ్చని, 30 రోజుల వ్యవధిలో చేపట్టాల్సిన ఎరువులు, యాజమాన్యంపై తెలుసుకోవచ్చని డాక్టర్ రెడ్డీస్ సమన్వయకర్త ఆర్.కృష్ణ రైతులకు తెలిపారు. డ్రిల్ యంత్రంతో నేరుగా సాగు చేసిన వరి ప్రదర్శనా క్షేత్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయకర్త పి.రమణ, అభ్యుదయ రైతులు ఐ.సత్యనారాయణ, కె.రాజశేఖర్ పాల్గొన్నారు.

రణస్థలం : మాట్లాడుతున్న తవిటినాయుడు

మాట్లాడుతున్న సిడిపిఒ నాగరాణి

పౌష్టికాహారంతో ప్రయోజనాలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ప్రాధాన్యతపై ఐసిడిఎస్ పిఒ నాగరాణి అవగాహన కల్పించారు. బుధవారం దానంపేట, కార్జీవీధిలో ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ ప్రతినిధులు పిలక విజయ భాస్కర్ రెడ్డి, నందిగాం కోటేశ్వరరావు, సూపర్‌వైజర్ సుజాత, ఆశావర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పలాస: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని కాశీబుగ్గ ఐసిడిఎస్ పిఒ వై.లావణ్య అన్నారు. మండలం రెంటికోటలో పోషకాహార మహోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎంఎస్ అధ్యక్షురాలు జి.శాంతమ్మ, పాఠశాల చైర్మన్ సంతోష్, రెంటికోట పిహెచ్‌సి వైద్యాధికారి సునీల్ కుమార్, సూపర్‌వైజర్ సరస్వతి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలు లేకుండా చూడాలి

పలాస: గ్రామంలో సమస్యలు లేకుండా చూడాలని ఎంపిడిఒ ఎన్.రమేష్ నాయుడు పంచాయతీ అధికారులకు ఆదేశించారు. మండలంలో గంగువాడలో మురికి కాలువ సమస్యలను ఎమ్మెల్యే శిరీషా దృష్టికి గ్రామస్తులు తీసుకువెళ్లడంతో ఆమె ఆదేశాల మేరకు బుధవారం మురికి కాలువ ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తగాదాలు పడవద్దని, సామరస్యంగా సమస్యలు పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. కాలువ నిర్మాణంలో ఎవరికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. ఆయనతో పాటు పంచాయతీ విస్తరణాధికారి మెట్ట వైకుంఠరావు, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

గుంతలో దిగబడిన భారీ వాహనం

ఎనిమిది గంటలు ట్రాఫిక్ అంతరాయం
అవస్థలు పడిన ప్రజలు

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని కొల్లివలస గ్రామ కూడలి వద్ద బుధవారం ఉదయం 6 గంటలకు ఓ పెద్ద బురద గుంటలో భారీ లారీ దిగిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. శ్రీకాకుళం నుంచి ఎన్‌హెచ్-5 రహదారిపై చిలకపాలెం వైపు వెళ్ళవలసిన ఓ భారీ లారీ మంగళవారం రాత్రి దారితప్పడంతో శ్రీకాకుళం కొత్త బ్రిడ్జి వద్ద ఆమదాలవలస వైపు వచ్చింది. అయితే దారితప్పిన విషయం బూర్జ మండలం కొల్లివలస వద్ద తెలుసుకోవడంతో చేసేదేమీ లేక లారీడ్రైవర్ ఆ రాత్రి అక్కడే లారీని ఉంచేశారు. అయితే తెల్లవారుజామున ఆరు గంటలకు లారీలు వెనకకు మళ్లించే క్రమంలో పెద్ద బురద గుంతలో భారీ వాహనం చక్రాలు కూరుకుపోయాయి. దీంతో ఇటు బూర్జ వరకు వాహనాలు నిలిచిపోగా అటువైపు ఉప్పిని వలస వరకు వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. లారీలో ఉన్న లోడును కిందకి దించేందుకు కూడా అవకాశం లేదని లారీలో ఉన్న లోడ్ సెంట్రల్ గవర్నమెంట్ రైల్వే బొగ్గు అని, దానికి సీల్ వేసి ఉందని డ్రైవర్ చెప్పడంతో ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. భారీ వాహనం కావడం, లారీలో అధిక లోడు ఉండడంతో సుమారు తొమ్మిది గంటల పాటు తీవ్ర ప్రయత్నం చేశారు. మొదట మూడు జెసిబిలతో లారీని బయటికి లాగేందుకు విశ్వ ప్రయత్నం చేశారు. అయినప్పటికీ ప్రయత్నం ఫలించకపోవడంతో స్థానిక ఎస్ఐ ప్రవళ్లిక శ్రీకాకుళం నుంచి భారీ హైడ్రాలిక్ మిషన్ తెప్పించి లారీని బయటకు తీసుకువచ్చారు. దీంతో ఎనిమిది గంటల పాటు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడగా వాహనాలు రాకపోకలను పోలీస్ సిబ్బంది క్రమబద్ధీకరించారు.

రోడ్డుకు అడ్డంగా గుంతలో దిగబడిన లారీ

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

శ్రీరాములు (ఫైల్)

జాతీయ రహదారిపై కేశవరావుపేట వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన విశ్రాంత ప్రధాన ఆచార్యులు పూజారి శ్రీరాములు (76) మృతి చెందారు. పోలీసులు, గ్రామస్తుల వివరాల మేరకు శ్రీకాకుళంలో నివాసం ఉంటున్న ఈయన సొంత గ్రామంలో సచివాలయ పని కోసం ఆటోపై వచ్చి గ్రామం వద్ద దిగి రోడ్డు దాటుతుండగా ప్రమాదం జరిగింది. పాతపట్నం నుంచి విశాఖపట్నం వెళ్తున్న కారు ఆయనను బలంగా ఢీకొట్టడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. చికిత్స కోసం శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈయనకు భార్య పూర్ణమ్మ, కుమారుడు శ్రీనివాసరావు ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతుడు చంద్రుడు

వంశధార కాలువలో మునిగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండల పరిధిలోని వంశధార కుడి ప్రధాన కాలువలో మునిగి ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ కె.వెంకటేష్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు శ్రీకాకుళం రూరల్ మండలం పొన్నాంకు చెందిన గుండ చంద్రుడు (44) ఆమదాలవలస మండల పరిధిలోని గాజుల కొల్లివలస వద్ద నున్న వంశధార కుడి ప్రధాన కాలువలో స్నానానికి దిగి మునిగి మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడు భవాని మాల ధరించాడని, ఆయన ఆటో డ్రైవర్ అని బుధవారం తన ఆటో మరమ్మతులకు గురికావడంతో పట్టణంలోని వన్‌వే జంక్షన్ వద్ద నున్న ఆటో మెకానిక్ వద్దకు ఆటోను తీసుకువచ్చాడని తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల సమయం కావస్తుండడంతో స్నానం చేసి బిక్షకు సమాయత్తం కావాలన్న ఆలోచనతో ఇద్దరు వ్యక్తులతో కలిసి వంశధార కుడి ప్రధాన పిల్లకాలువలో స్నానానికి దిగాడని లోతుగా ఉండడంతో మునిగి పోయాడని, అది గమనించిన ఆ వ్యక్తులు పిల్ల కాలువలో దిగి ఒడ్డుకు తీసుకువచ్చే సరికే మృతి చెందాడని తెలిపారు. మృతుడు భార్య గుండ పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలో రిమ్స్‌కు మృతదేహాన్ని తరలించినట్లు తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి- పాతపట్నం

మండలం తెంబూరుకు చెందిన సందిపేట వెంకటరమణ కుటుంబ కలహాల నేపథ్యంలో జరిగిన గొడవల కారణంగా మంగళవారం ఉదయం ఇంటి నుంచి పొలానికి వెళ్తానని చెప్పి తిరిగి ఇంటికి రాకపోవడంతో భార్య సంధిపేట కృష్ణవేణి, కుమారుడు సంధిపేట విక్రమ్ బుధవారం మధ్యాహ్నం పాతపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ. బి.లావణ్య తెలిపారు.

నివాళ్లర్పిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

టంకోదర మృతి తీరని లోటు

ప్రజాశక్తి- పలాస

ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం చేసిన వ్యక్తి కొర్ల టంకోదర మృతి తీరని లోటని ఉపాధ్యాయ సంఘాల నాయకులు అన్నారు. శివాజీనగర్‌లో బుధవారం ఎపిటిఎఫ్ వజ్రపుకొత్తూరు శాఖ అధ్వర్యంలో టంకోదర సంతాప సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ ఫెడరేషన్‌లో నిబద్ధత కలిగిన ఒక నాయకునిగా అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు బల్లెడ రవి, ఫెడరేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు టెంక చలపతిరావు, నానుబాల ప్రభాకరరావు, జిల్లా బాధ్యులు మామిడి భుజంగరావు, జోగారావు, వజ్రపుకొత్తూరు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కలిశెట్టి నాగేశ్వరరావు, గున్న సుభాష్, సురేష్, పలాస అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నల్లాన నాగేశ్వరరావు, కూర్మాపు ప్రసాదరావు, మధుసూదనరావు పాల్గొన్నారు.

బాడీ బిల్డింగ్‌కు సిక్కోలు యువకుడు

వజ్రపుకొత్తూరు: మండలం ధర్మపురానికి చెందిన రెల్ల గణేష్ జాతీయస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. బుధవారం గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో పాల్గొని 60 కేజీల విభాగంలో మొదటి స్థానం కైవసం చేసుకున్నారు. మెయిన్స్ ఫిజిక్‌లో మూడవ స్థానం సాధించి ఈ నెల 20 నుంచి 22 వరకు ముంబైలో జరిగే జాతీయస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలకు రేల గణేష్ అర్హత సాధించారని కోచ్ నెయ్యల భాస్కరరావు తెలిపారు.

కొత్తరోడ్డు వద్ద ట్రాఫిక్‌జామ్‌లో ఇరుక్కున్న వాహనాలు

భారీగా ట్రాఫిక్‌జామ్

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండల పరిధిలోని కొత్త రోడ్డు వద్ద ట్రాఫిక్ జామ్‌తో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. బుధవారం సాయంత్రం కురిసిన వర్షానికి కొత్త రోడ్డు ముందర ఉన్న గెడ్డకు అవతల వైపు కొత్త రోడ్డు వైపు సుమారు అర కిలోమీటర్ వరకు ఎక్కడ వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ఆమదాలవలస, శ్రీకాకుళం రహదారి పూర్తిగా మరమ్మతులకు గురి కావడంతో గుంతల్లో వర్షపు నీరు చేరడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అరగంట తర్వాత పెట్రోలింగ్ పోలీసులు అక్కడకు చేరుకొని ట్రాఫిక్‌ను సరి చేశారు.

పలాస : వడ్డిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పలు గ్రామాల్లో అన్నదానం

ప్రజాశక్తి - పోలాకి

మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద బుధవారం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. రేవు అంపలం, పోలాకి కేంద్రంలో గల ఇందిరానగర్, పాలవీధి, తలసముద్రం తదితర గ్రామాల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమంలో పరిసర ప్రాంతాల నుంచి యాత్రికులు వచ్చి ప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు.

పలాస: కాశీబుగ్గ పల్లివీధి, శ్రీనివాస్ నగర్‌లో వినాయక మండపాలు వద్ద బుధవారం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఎమ్మెల్యే గౌతు శిరీష పాల్గొని యాత్రికులకు వడ్డించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, కౌన్సిలర్ డిక్కల ఆనంద్, దడియాల నర్సింహులు, నాటెళ్ల శ్రీనివాస్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులతో శ్రీను

జాతీయ తైక్వాండో పోటీల్లో సత్తా చాటాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

తమిళనాడులోని దిండిగల్ వేదికగా ఈనెల 14వ తేదీ వరకు జరుగుతున్న రెండో అస్మిత ఉమెన్స్ తైక్వాండో లీగ్-2024 (ఖేలో ఇండియా) జాతీయస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటి విజేతలుగా తిరిగి రావాలని ఏపి తైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షులు తైక్వాండో శ్రీను సూచించారు. ఇటీవల తిరుపతి వేదికగా నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచి జాతీయస్థాయి పోటీలకు విజయం సాధించిన క్రీడాకారులను అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో రాణించి జిల్లాకు పేరు తీసుకురావాలన్నారు. రెండో అస్మిత ఉమెన్స్ తైక్వాండో లీగ్ -2024 (ఖేలో ఇండియా) జాతీయ స్థాయి పోటీలకు బయలుదేరిన విద్యార్థులకు శు భాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైశ్యరాజు మోహన్, గిడుతూరి వెంకటేశ్వరరావు, ఎం.సుధీర్ వర్మ అభినందించారు. కోచ్‌లుగా మజ్జి గౌతమ్, మోర్తా సాయి బాలాజీ వ్యవహరిస్తున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకాంత్

స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో కుష్టు వ్యాధిగ్రస్తులకు స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎడిఎంహెచ్ఒ డాక్టర్ టి.శ్రీకాంత్ అన్నారు. జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో బ్రైట్ ఫ్యూచర్స్ డెవలప్‌మెంట్ ట్రస్టు సంస్థ జిల్లా ప్రతినిధులు ఎలీషా, వెంకటేశ్వరరావుతో కుష్టు వ్యాధిగ్రస్తులకు అందిస్తున్న సేవలపై ఆయన చర్చించారు. నగరంలోని కుష్టు వ్యాది గ్రస్థులకు ప్రభుత్వం, రెడ్‌క్రాస్ వంటి సంస్థల అందిస్తున్న సేవలను ఆయన ప్రస్తావించారు. ఆర్థిక, సామాజిక అవసరాలను గుర్తించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ వాన సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


వినాయక మండపం వద్ద ఎమ్మెల్యే అశోక్

వినాయక మండపం సందర్శన

ఇచ్ఛాపురం: పట్టణంలో ఆస్పత్రి రోడ్డులో ఉన్న వినాయక మండపాన్ని ఎమ్మెల్యే బెందాలం అశోక్ బుధవారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కమిటీసభ్యులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

నాట్య ప్రదర్శనకు వెళ్తున్న కళాకారులు

శ్రీశైలంలో ప్రదర్శనకు ఇచ్ఛాపురం కళాకారులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

శ్రీశైల దేవస్థానం మల్లిఖార్జునస్వామి శక్తి పీఠాల్లో ఒకటైన శ్రీ భ్రమరాంబ అమ్మవారి ఆలయంలో ధర్మపదం కార్యక్రమంలో పట్టణానికి చెందిన శ్రీ వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ చిన్నారులకు దక్కింది. ఆలయ నిర్వహణ కమిటీ అధికారులు, కార్యనిర్వహణ అధికారి పెద్ది రాజు ఆహ్వానం మేరకు ఈ నెల 13 సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు శాస్త్రీయ నృత్యాలు, కూచిపూడి, భరతనాట్యం కార్యక్రమానికి అవకాశాన్ని అందించారు. అకాడమీ అధ్యక్షులు వెంకటేశ్వర పట్నాయక్ (చిన్నా గురుస్వామి, జయలక్ష్మి దంపతుల నాట్య గురువు శృతి పట్నాయక్ ఆధ్వర్యంలో కళాకారులు నాట్యంలో పాల్గొంటున్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

కోటబొమ్మాళి: కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, జిఒ నెంబర్ 115కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కోటబొమ్మాళి సామాజిక ఆస్పత్రిలో పనిచేస్తున్న స్టాఫ్‌నర్సులు బుధవారం నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలుపుతూ విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురువారం కూడా నల్లరిబ్బన్లు ధరించి నరసన తెలపడం జరుగుతుందన్నారు.

నల్లరిబ్బన్లతో నిరసన తెలుపుతున్న స్టాఫ్ నర్సులు

'పది' పరీక్షలపై స్పష్టత ఇవ్వాలి

ప్రజాశక్తి- పొందూరు

రాష్ట్రంలో 2024-25 విద్యా సంవత్సరంలో నిర్వహించే పది పరీక్షల మాధ్యమంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల్లో నెలకొన్న గందరగోళ పరిస్థితులను ప్రభుత్వం నివృతి చేయాలని డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పూజారి హరి ప్రసన్న డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. 2022లో అప్పటి వైసిపి ప్రభుత్వంలో రాష్ట్రంలో 1 నుంచి 10 వరకు సింగిల్ మాధ్యమంలో (ఆంగ్లం) భోదించాలంటూ విద్యాశాఖ 84, 85 జిఒలు జారీ చేసిందని, 2024-25 విద్యా సంవత్సరానికి జరిగే పదవ తరగతి పరీక్షలు విద్యార్థులు ఆంగ్ల మాధ్యమంలో పరీక్షలు రాయాలని అప్పట్లో విద్యాశాఖ జిఒల్లో పేర్కొందన్నారు. ఈ జిఒ మాతృభాషా మాధ్యమానికి ఆటంకమంటూ గుంటుపల్లి శ్రీనివాసరావు, డబ్బీరు రమేష్ పట్నాయక్ హైకోర్టులో కేసు వేశారని, కేసు విచారణలో ఉందన్నారు. రెండు మాధ్యమాలలో నిర్వహించేందుకు అప్పట్లో ప్రస్తుత మానవవనరుల శాఖామంత్రి హామీఇచ్చినా ఇప్పటివరకు రాష్ట్ర అధికారులు పరీక్షల మాధ్యమంపై స్పష్టత ఇవ్వకపోవడంతో తీవ్ర గందరగోళం నెలకొందని, ప్రభుత్వం తక్షణమే దీనిపై స్పష్టతవివ్వాలని కోరారు.

మాట్లాడుతున్న హరిప్రసన్న

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

టెక్కలిరూరల్: మండలంలో రావివలస, శ్యామసుందర పురం అదిత్య ఇంజనీరింగ్ కళాశాల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఆశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.శంకరరావు తెలిపారు. 11 కెవి వార్షిక మరమ్మతులు చేపడుతుండడంతో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరిం చాలని కోరారు.

ఆమదాలవలస : మండలంలోని గాజుల కొల్లివలస 33, 11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మునగ వలస, గాజుల కొల్లివలస ఫీడర్ల పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఇఇ ఎస్.బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలో చెట్లుకొమ్మలు తొలగించుట, విద్యుత్ లైన్స్ మరమ్మతులు కారణంగా మండలంలో గాజుల కొల్లివలస, చిన్న జొన్నవలస, పెద్ద జొన్నవలస, మునగవలస, రాధాకృష్ణాపురం, రామ చంద్రాపురం, పొన్నంపేట, చిట్టివలస, సైలాడ, కుమ్మరి పేట, చవ్వాకులపేట, అక్కులపేట, తాళ్లవలస, మండాది గ్రామాలకు విద్యుత్ సరఫరాలో నిలిపి వేస్తున్నట్టు తెలిపారు. పట్టణంలోని పార్వతీశంపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కెవి కృష్ణాపురం ఫీడర్ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. పట్టణ పరిధిలో పార్వతీశం పేట, కృష్ణాపురం, ప్రభుత్వ జూని యర్ కళాశాల, కోర్టు, మున్సిపల్ కార్యాలయం, చంద్రయ్యపేట ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

ఎపిఎంలకు శిక్షణ

గోపాలకృష్ణ నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న ఎపిఎం

ప్రజాశక్తి- ఆమదాలవలస

రాష్ట్రంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, సమైక్యలు బలోపేతం చేసే దిశగా జాతీయ స్థాయిలో ఇచ్చే శిక్షణలో ఐకెపి ఎపిఎం పైడి కూర్మారావు పాల్గొన్నారు. బుధవారం ఐకెపి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేస్తూ సిఎం చంద్రబాబు నాయుడు, కేంద్ర ప్రభుత్వం భాగస్వామ్యంతో చేపట్టనున్న మహిళా సంఘాల వ్యాపార ప్రణాళికపై తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో గత మూడు రోజులుగా జాతీయ స్థాయిలో శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. పేదరిక నిర్మూలన సంస్థ, జాతీయ జీవనోపాధుల మిషన్ ఆధ్వర్యంలో ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్ సిహెచ్ రాధికారాణి, రిసోర్స్ పర్సన్ గోపాలకృష్ణ, బాబూరావు, శ్రీనివాసరావు మూడురోజులు ఇచ్చిన శిక్షణలో ఎపిఎం కూర్మారావు పాల్గొని ధ్రువపత్రంతో పాటు ప్రశంసాపత్రాన్ని అందుకోవడం జరిగిందన్నారు. ఈ శిక్షణ ద్వారా ప్రతి స్వయంశక్తి సంఘ సభ్యురాలు ఆదాయాలు పెంచే విధంగా వ్యాపార ప్రణాళికలు తయారుచేసి ప్రతి ఒక్కరిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దిలా చేయాలనే కేంద్ర ప్రభుత్వం ఆశయ సాధనకు ఎంతో దోహదపడుతుందని శిక్షణ పొందిన కూర్మారావు తదితరులు తెలిపారు.

ఇచ్ఛాపురం: పేదరిక నిర్మూలన సంస్థ, జాతీయ జీవనోపాధుల మిషన్ ఆధ్వర్యంలో మూడురోజుల పాటు ఇచ్చిన శిక్షణ విజయవంతంగా పూర్తి చేసినట్లు వెలుగు ఎపిఎం ప్రసాదరావు తెలిపారు. శిక్షణ అనంతరం ప్రశంసాపత్రాన్ని అందించినట్టు తెలిపారు.

ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న ఎపిఎం ప్రసాదరావు

విద్యార్థులకు మెనూ అమలు చేయాలి

ప్రజాశక్తి- పొందూరు

ప్రభుత్వ పాఠశాలల్లో, అంగన్వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు, చిన్నారులకు ప్రభుత్వం సూచించిన ప్రకారం నాణ్యమైన మెనూ అమలు చేయాలని జిల్లా బాలలహక్కుల పరిరక్షణ కన్వీనర్ కొత్తకోట శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కింతలి, కనిమెట్ట, అచ్చిపోలవలసలో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సూచి ంచిన విధంగా నాణ్యమైన మెనూ పెట్టకపోతే సంబంధిత ఏజన్సీలు, ఉద్యోగులపై చైల్డ్ రైట్స్ కమిషన్ ద్వారా కేసులు నమోదు చేసి చర్యలు తీసు కోవడం జరుగు తుందన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో హాజరు ప్రకారం ఉండాల్సిన చిన్నారుల కంటే తక్కువగా ఉండటంపై అంగన్వాడీ కార్యకర్తలను ప్రశ్నించారు.

అంగన్వాడీ కేంద్రంలో వంటలు పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

నగదును హెచ్ఎంకు అందజేస్తున్న విశ్రాంత హెచ్ఎం

విశ్రాంత హెచ్ఎం ఔదార్యం

ప్రజాశక్తి- మందస

మండలం సొండిపూడి హైస్కూల్ మధ్యాహ్న భోజన కార్మికులకు గ్లౌజ్‌లు, మాస్కులు కొనుగోలు చేయాలని అదే గ్రామానికి చెందిన విశ్రాంత హెచ్ఎం నగిరి లక్ష్మీనారాయణ ప్రస్తుత హెచ్ఎం సుందర్ సాల్మన్‌కు రూ.10 వేలు నగదు అందజేశారు. విద్యార్థులకు భోజనం వడ్డించే సమయంలో ఏజెన్సీ సిబ్బంది పరిశుభ్రంగా ఉండాలనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ఎండిఎం ఏజెన్సీ మిగతా వారికి ఆదర్శంగా ఉండాలని ప్రోత్సహించినందుకు నగిరి లక్ష్మీనారాయణను సిబ్బంది సమక్షంలో అభినందించారు. ఇదే పాఠశాలలో దాత పెద్ద కుమారుడు నగిరి కరుణాకర్ ఆంగ్ల ఉపాధ్యాయులుగా పని చేయడం గమనార్హం. కార్యక్రమంలో ఎస్.అప్పారావు, కరుణాకర్, ఎస్.నారాయణరావు, చంద్రశేఖరరావు, కె.వెంకటరమణ, ఆర్. చంటిబాబు, వై.తులసీదాసు, జోత్స్న, ఎం.ఇందిర పాల్గొన్నారు.

నిర్మాణాలు వేగవంతం చేయాలి

కోటబొమ్మాళి: మండలంలో పలు పంచాయతీల్లో నిర్మాణాలు కానీ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపిడిఒ కె.పణీంద్రకుమార్ అన్నారు. బుధవారం ఫీల్డు అసిస్టెంట్లుతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో దుప్పలపాడు, మసాహెబ్‌పేట, కన్నేవలస, యలమంచిలి, గంగారం, వాండ్రాడ, జర్జంగి, కొత్తపేట పంచాయతీల్లో ఈ నిర్మాణాలు జరగలేదని ఈ కేంద్రాల నిర్మాణాన్ని వేగవంతం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే 100 రోజులకు దగ్గరగా ఉన్న వేతనదారులకు పనులు కల్పించి వంద రోజులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎపిడి శైలజ, ఎపిఒ జి.హరిప్రసాద్, ఇసి టి. రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ

పాత గృహ నిర్మాణాల గుర్తింపు

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో గత టిడిపి పాలనలో నిర్మాణాలు జరిగి బిల్లులు అందక ఉన్న పాత గృహ నిర్మాణాలపై మండల గృహ నిర్మాణశాఖ సర్వే నిర్వహిస్తోంది. ఇటీవల సరుబుజ్జిలి మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే కూన రవికుమార్ 2014-2019 మధ్య టిడిపి ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలకు గత వైసిపి ప్రభుత్వం బిల్లులు నిలిపివేసిందని, వాటిని తక్షణమే గుర్తించి బిల్లుల చెల్లింపు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. తక్షణమే మండలంలో అటువంటి ఇళ్ల పరిస్థితులను గుర్తించి నివేదిక రూపొందించాలని ఆదేశించారు. బుధవారం గ్రామ పంచాయతీలో గృహ నిర్మాణశాఖ అధికారులు, టిడిపి నాయకులు ఎండ రామారావు, రాకోటి శ్రీరామమూర్తి, బెండి శ్రీనివాసరావు బిల్లులు అందని గృహనిర్మాణ లబ్ధిదారుల నుంచి వివరాలను సేకరించారు.


పాత గృహాల సర్వే చేపడుతున్న అధికారులు

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని పెద్ద రొంపివలస, ఇజ్జడపాళెం గ్రామాల్లో బుధవారం మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ పలువురుని పరామర్శించారు. పెద్ద రొంపవలసకు చెందిన వైసిపి నాయకుడు మీసాల వెంకటప్పల నాయుడు ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇజ్జడపాళెంకు చెందిన సన్యాసినాయుడు బీర్ పరిశ్రమలో పనిచేసి తిరిగి ఇంటికి వస్తు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడడంతో సన్యాసినాయుడును పరామర్శించారు. ఈయన వెంట జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, వైసిపి నాయకులు బురాడ చిన్నారావు, ఎంపిటిసి రాముడు, గొర్లె ప్రకాష్, వెంకట్ నాయుడు, మీసాల బానోజీరావు తదితరులున్నారు.

పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

నివాళ్లర్పిస్తున్న అటవీశాఖ సిబ్బంది

అటవీ అమరులకు ఘన నివాళి

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

అడవుల సంరక్షణలో అమరులైన అటవీశాఖ ఉద్యోగులను స్మరించుకుంటూ జిల్లా ఫారెస్ట్ కాంప్లెక్స్ ఆవరణలో జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. డిఎఫ్ఒ ఎస్.వెంకటేష్ అమరవీరులకు నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని అడవులు వన్యప్రాణుల రక్షణలో తమ ప్రాణాలను త్యాగం చేసిన వారిని గౌరవించుకోవడమే జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవ ముఖ్య ఉద్దేశమన్నారు. విధి నిర్వహణలో అటవీ సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టెక్కలి సబ్ డిఎఫ్ఒ ఎ.వి నాగేంద్ర, అటవీ అధికారులు పి.అమ్మన్నాయుడు, ఆర్.రాజశేఖర్, ఎం.నిహారిక సిబ్బంది పాల్గొన్నారు.

మాతృభాష మూలాలు మర్చిపోవద్దు

ప్రజాశక్తి- పలాస

పుట్టుకతో నేర్చుకునే మాతృభాష మాధుర్యాన్ని ఆస్వాధించాలని, మూలాలను మర్చిపోవద్దని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు, తెలుగుభాషా భూషణ అవార్డు గ్రహీత, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు మూల తాతయ్య అన్నారు. బుధవారం విద్యావాహిని డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సర స్వాగతోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులకు పలు అంశాలపై బోధించారు. గత పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు నృత్య ప్రదర్శనలు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎ.గిరిబాబు అధ్యక్షతన నిర్వహించి కార్యక్రమంలో కరస్పాండెంట్ తిరుమలరావు, డైరెక్టర్లు సంధ్య, పైల మన్మథరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రీడాకారులతో ఉపాధ్యాయులు, నాయకులు

క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి మండలస్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలు గోవిందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం హరిబాబు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ అండర్ -14, అండర్ -17 విభాగాల్లో బాల బాలికలు పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో 250 మంది విద్యార్థులు పాల్గొనగా 48 మందిని ఎంపిక చేసినట్లు వ్యాయామ ఉపాధ్యాయులు నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి రమణ, టిడిపి నాయకులు పుచ్చ ఈశ్వరరావు, మండల క్రీడా కార్యదర్శి చంద్రశేఖర్, జోన్ 1 ప్రెసిడెంట్ గొరకల లోకేష్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

15లోగా పంట నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

రైతులు ఖరీఫ్ 2024లో తాము పండిస్తున్న అన్ని రకాల పంటలకు రైతుసేవా కేంద్రంలో ఈ నెల 15లోగా పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి దానకర్ణుడు తెలిపారు. ఎవరైనా రైతులు పంట నమోదు చేసుకొని యెడల తక్షణమే మీ దగ్గర ఉన్న రైతుసేవా కేంద్రంలో ఉన్న వ్యవసాయ సహాయకులు వద్ద పంట నమోదు చేసుకోవాలన్నారు. పంట నమోదు చేసుకున్న రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని పథకాలు వర్తిస్తాయన్నారు.



చెక్కును అందజేస్తున్న ఆర్‌పిలు

మానవత్వం చాటుకున్న ఆర్‌పిలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కష్టంలో ఉన్న వారికి సాయమందించడంలోనే నిజమైన మానవత్వం ఉంటుందని నగరానికి చెందిన అర్బన్ పరిధిలోని స్వయంశక్తి సంఘాల రీసోర్స్‌పర్సన్లు రుజువు చేశారు. మెప్మా ఆధ్వర్యంలో రూ.2.30 లక్షల చెక్కును ఎమ్మెల్యే గొండు శంకర్ ద్వారా సిఎం సహాయనిధికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విజయవాడ వరద బాధితుల కష్టాలు వర్ణణాతీతంగా ఉన్నాయని, సర్వం కోల్పోయి నిరాశ్రయులుగా మిగిలారన్నారు. కట్టుబట్టలతో మిగిలిన తమ తోటివారికి తోచిన సాయం అందించేందుకు ముందుకు వచ్చిన స్వయంశక్తి సంఘాల ఆర్‌పిలకు ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నాయకులు రెడ్డి గిరిజాశంకర్, మెప్మా సిఎంఎం ఎస్.వెంకటరావు, రీసోర్స్‌పర్సన్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.



పవన్‌కళ్యాణ్‌కు చెక్కును అందజేస్తున్న మధు తదితరులు

రూ.80 లక్షలు అందజేత

ప్రజాశక్తి- లావేరు

ఎపి డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌కు విజయవాడ వరద బాధితుల సహాయార్థం శ్రీకాకుళం జిల్లా గ్రామ సర్వేయర్ల సంఘం ఆధ్వర్యంలో జిల్లా సంఘ అధ్యక్షుడు బురాడ మధు, రాష్ట్ర సంఘం అధ్యక్షుడుతో కలిసి జిల్లా గ్రామ సర్వేయర్లు ఒక్క రోజు వేతనం రూ.80 లక్షల చెక్కును డిప్యూటీ సిఎంకు అందజేశారు. ఈ సందర్భంగా చెక్కును స్వీకరించిన డిప్యూటీ మాట్లాడుతూ బాధల్లో ఉన్నవాళ్లను ఆదుకోవడం గొప్ప విషయమని, విపత్తుల సమయంలో ప్రతిఒక్కరు తమ శక్తి మేర సహాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా, రాష్ట్ర సంఘం నాయకులు ఉన్నారు.

రాజును అభినందిస్తున్న ఎమ్మెల్యే అశోక్

దాసరి రాజు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఎమ్మెల్యే బెందాలం అశోక్ కేకు కట్ చేసి రాజుకు అభినందనలు తెలిపారు. 11వ వార్డు కౌన్సిలర్ కలియా గౌడ్, సోంపేట, కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం మండల, మున్సిపాలిటీ నాయకులు రాజుకు పుష్పగుచ్చాలిచ్చి అభినందనలు తెలిపారు. సోంపేట మండలం గొల్లకండి గ్రామానికి చెందిన వైసిపి జిల్లా యువజన కార్యదర్శి రాజారావు 30 మంది సభ్యులతో పార్టీలో చేరారు. కార్యక్రమంలో రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తిప్పన దుర్యోధన, మత్స్యకార వికాస్ విభాగ కార్యదర్శి హరి బెహరా, నాయకులు ప్రసాదరావు, నందిక జాని, కాళ్ల దిలీప్ కుమార్, కోటి, జానకిరావు, లీలారాణి పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న తహశీల్దార్ వెంకటరావు

పారిశుధ్య పనులు పరిశీలన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలో భారీ వర్షాలతో పద్మాపురం గెడ్డనీరు ఇన్నీసుపేట గ్రామంలో చేరడంతో జల దిగ్బంధంలో చిక్కుకుంది. బుదవారం గ్రామంలో వరదనీరు తగ్గు ముఖం పట్టడంతో తహశీల్దార్ వెంకటరావు పరిశీలించారు. గ్రామంలో ఎటువంటి అంటువ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. అధికార యంత్రాంగం అప్రమత్తమై గ్రామంలో శానిటేషన్ పనులు వేగవంతం చేశారు. కార్యక్రమంలో రెవెన్యు సిబ్బంది పాల్గొన్నారు.

తులసీప్రసాద్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఉత్తమ ఉపాధ్యాయునికి సత్కారం

నందిగాం: జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు అందుకున్న లఖిదాసుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు తులసీప్రసాద్‌ను బుధవారం పాఠశాల ఉపాధ్యాయులు సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం చిలుకు కృష్ణారావు తులసీప్రసాద్ సేవలను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రంకిడి రామారావు, రత్నం గోవిందరాజు, ప్రియదర్శిని, యాగాటి త్రినాథరావు, దుంపా శ్రీనివాస్, దుంపల సంధ్యారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

పలాస: మండలం మోదుగులపుట్టి గ్రామానికి చెందిన అవుగాన షణ్ముకరావు తండ్రి, పలాసకు చెందిన విద్యార్థి రోణంకి ప్రవీణ్ కుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గౌతు శిరీష మృతుల కుటుంబాలను బుధవారం పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమెతో పాటు టిడిపి నాయకులు లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, డొక్కరి శంకర్, కొరికాన శంకర్ తదితరులున్నారు.